ప్రజాశక్తి

బుధవారం 4 సెప్టెంబర్ 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు



దుగ్గిరాల మండలంలో నీటమునిగిన ఉద్యాన పంటలు

ఉద్యాన రైతుల విలవిల

నష్టం అంచనాల్లో యంత్రాంగం నిమగ్నం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

వాయుగుండం ప్రభావంతో కురిసిన అతి భారీ వర్షాలు, అనంతరం వచ్చిన వరదతో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పైర్లకు అపార నష్టం జరిగింది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులలో ఎక్కువ మంది నష్టపోయారు. గుంటూరు జిల్లాలో దాదాపు 60 వేల మందికి చెందిన లక్షన్నర ఎకరాల్లో పైర్లు దెబ్బతిన్నాయి. పల్నాడు జిల్లాలో దాదాపు 9 వేలమంది రైతులకు చెందిన 20 వేల ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. అయితే పల్నాడు జిల్లాలో కృష్ణాతీర ప్రాంతంలోని అచ్చంపేట, దాచేపల్లి, క్రోసూరు, మాచవరం, అమరావతి మండలాల్లో నష్టం ఇంకా ఎక్కువగా ఉంది. కృష్ణానది పరివాహక ప్రాంతంలోని లంక భూముల్లో నీరు తొలగకపోవడంతో నష్టం మరింత పెరిగే అవకాశం ఉంది.

భారీ వర్షాలు, వరదల వల్ల గుంటూరు జిల్లాలో వ్యవసాయ, ఉద్యానవన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అనేక ప్రాంతాల్లో ఇప్పటికి పంటలు నీటి మునిగే ఉన్నాయి. పంట ముంపుపై ప్రాథమిక నివేదికలు రూపొందించిన ఆయా శాఖలు తాజాగా నష్టం అంచనాలను రూపొందించేందుకు క్షేత్రస్థాయి కసరత్తు చేస్తున్నాయి. వరద ప్రవాహం తగ్గుముఖం పట్టినప్పటికీ రైతుల్లో ఆందోళన కొనసాగుతోంది. పొలాల్లో నీరు ఇంకా నిలిచే ఉంది. దీంతో నష్టం ▶ 2లో

వరద బాధితులకు నిత్యావసరాల కిట్లు : గుంటూరు కలెక్టర్ 2లో

పాఠశాలకు నేడూ సెలవు

ప్రజాశక్తి-గుంటూరు

వరదల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం గుంటూరు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తరగతులు రద్దు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు, హెచ్‌ఎం పాఠశాలలకు హాజరు కావాలని, విద్యార్థులకు సెలవు ఇవ్వాలని తెలిపారు. హాజరైన ఉపాధ్యాయులు పరిసరాలను పరిశీలించి, ఏమైనా లోపాలు ఉంటే సరిచేసుకొని 5వ తేదీన విద్యార్థులు పాఠశాలకు క్షేమంగా హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



రామాపురంలో దెబ్బతిన్న పత్తిపైరును పరిశీలిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

పరిస్థితులు చక్కబడే వరకూ పునరావాస కేంద్రాలు

మత్స్యకారులకు ఇళ్ల పట్టాలిచ్చేందుకు కృషి : పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దాచేపల్లి మండలం రామాపురం జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మంగళవారం సందర్శించారు. గ్రామంలో కృష్ణా నదీ తీరాన మత్స్యకారులు నివసిస్తున్న కాలనీలోకి వరద నీరు రావడంతో 43 కుటుంబాలకు చెందిన 157 మందికి స్థానిక పాఠశాలలో పునరావాసం కల్పించారు. పరిస్థితులు మెరుగై, మత్స్యకారులు తిరిగి వారి ఇళ్లకు చేరేందుకు ▶ 2లో



సమావేశంలో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

రైతు సమస్యలపై 25న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు

- వరద బాధిత రైతులకు సత్వరమే పరిహారం ఇవ్వాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి-సత్తెనపల్లి

రైతు సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ల వద్ద 25న నిర్వహించే ధర్నాలను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. సిపిఎం పల్నాడు జిల్లా విస్తృత సమావేశం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరిగింది. సమావేశానికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ అధ్యక్షత వహించగా కృష్ణయ్య మాట్లాడుతూ జూన్‌లోనే ఇవ్వాల్సిన పెట్టుబడి సాయాన్ని ఇప్పటికీ ఇవ్వలేదని, సత్వరమే అందించాలని డిమాండ్ చేశారు. గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వ్యవసాయం మోటార్లకు మీటర్లు పెడుతుంటే వ్యతిరేకించిన టిడిపి ప్రస్తుతం మోటార్లకు మీటర్లు పెట్టే ఆలోచనను మానుకోవాలని కోరారు. పంటల బీమాలో కొత్త విధానాన్ని అమలు చేయాలన్నారు. బాపట్ల, ప్రకాశం జిల్లాల కలెక్టర్లు ఆరుతడులకు మాత్రమే నీటిని విడుదల చేస్తామని చెప్పారని, ఇది సరైనది కాదని వరికి కూడా నీటిని విడుదల చేసి సమృద్ధిగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎరువులు పురుగు మందుల ధరలు విపరీతంగా పెరిగాయని, వ్యవసాయం భారంగా మారిందని, ఈ నేపథ్యంలో రైతు సమస్యలపై ▶ 2లో

వాగులో ఒకరు గల్లంతు

మోటారు తీస్తుండగా ప్రమాదం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

వాగులోని నీటి మోటారును బయటకు తెచ్చే క్రమంలో ఒకరు గల్లంతైన ఘటన మండలంలోని కోనంకిలో మంగళవారం జరిగింది. పట్టణ సిఐ వెంకట్రావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పుణ్యాల సాంబశివారెడ్డి తన పొలానికి నీరు పెట్టుకోవడం కోసం స్థానిక పీలేరు వాగులో మోటారును ఏర్పాటు చేసుకున్నారు. అయితే వరదల నేపథ్యంలో మోటారు కొట్టుకుపోతుందని భావించి దాన్ని బయటకు తేవాలని స్థానికుడైన 38 ఏళ్ల నీలం శ్రీనివాసరావును పురమాయించారు. శ్రీనివాసరావుతోపాటు కొందరు మంగళవారం సాయంత్రం వాగు వద్దకు వెళ్లారు. వాగులోని నేరేడు చెట్టు మడుగు సమీపంలో ఉన్న మోటారును తీసిన శ్రీనివాసరావు దాన్ని ఒడ్డునున్న వారికి అందించాక పట్టుతప్పి వాగు నుండి బయటకు రాలేక గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు గాలింపు చేపట్టారు. గతంలో ఇదే ప్రాంతంలో గ్రామానికి చెందిన పేరెడ్డి అనే వ్యక్తి కూడా వాగులోపడి చనిపోయాడని గ్రామస్తులు తెలిపారు.



2లో

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి



భోజనాలు అందజేస్తున్న ఎంబివికె బాధ్యులు

ఎంబివికె ఆపన్నహస్తం

మహానాడు, సుందరయ్యనగర్ బాధితులకు భోజనాలు ఏర్పాటు



లింగారావుపాలెంలో జెసి పరిశీలన

ప్రజాశక్తి - యడ్లపాడు

వర్షాల వల్ల మండలంలోని లింగారావుపాలెంలో దెబ్బతిన్న పొలాలను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ సోమవారం పరిశీలించారు. ఆయనవెంట నరసరావుపేట ఆర్డీవో స్వర్ణలత, తహశీల్దార్ విజయశ్రీ, ఏవో సరిత ఉన్నారు.

పరిస్థితులు చక్కబడే వరకూ పునరావాస కేంద్రాలు

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధమయ్యే వరకూ పునరావాస కేంద్రాన్ని కొనసాగిస్తామని కలెక్టర్ ప్రకటించారు. కేంద్రంలో వైద్య శిబిరాన్నీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కేంద్రంలో మరిన్ని ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పడవలు దెబ్బతిన్న మత్స్యకారులకు పరిహారం అందిస్తామన్నారు. అనంతరం పునరావాస కేంద్రంలోని వారికి ఒక్కో కుటుంబానికి బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన 28 మంది డ్వాక్రా మహిళలకు రూ.2.80 లక్షల వడ్డీ లేని రుణ చెక్కులను అందించారు.

అనంతరం గ్రామంలో దెబ్బతిన్న పొలాలను కలెక్టర్ పరిశీలించారు. పులిచింతల ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల గ్రామంలోని ఇళ్లలోకి నీరు చేరడం, వందల ఎకరాల్లో పంటలకు నష్టం చేకూరడం, పలు రైతులు పంట వేసేందుకు వెనకాడే పరిస్థితులపై ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. నదీ తీరాన నివాసాలు ఏర్పరుచుకున్న మత్స్యకారులకు ఇళ్ల పట్టాలను మంజూరు చేసే అవకాశాన్ని పరిశీలిస్తామన్నారు. పరిశీలనలో గురజాల ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మురళి, జిల్లా ఉద్యాన అధికారి రమణారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి, డిఆర్‌డిఎ పీడీ బాలునాయక్, డీఎల్డీవో గబ్రూ నాయక్, తహశీల్దార్ కుటుంబరావు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై 25న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళలకు పిలుపునిచ్చామని చెప్పారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ వర్షాల కారణంగా కృష్ణానది పరివాహక ప్రాంతంలో రైతులు నష్టపోయారని, పంట నష్టాన్ని సత్వరమే అంచనా వేసి పరిహారం వెంటనే ఇవ్వాలని కోరారు. కౌలు రైతులకూ పరిహారం దక్కేలా చూడాలన్నారు. ముంపునకు గురైన ఇళ్లను నమోదు చేసి చేసి ప్రతి కుటుంబానికి రూ.25 వేలను తక్షణ సాయంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, ఎవిఎన్ గోపాలరావు, ఎస్.ఆంజనేయులు నాయక్, జి.రవిబాబు, ఇతరన నాయకులు పాల్గొన్నారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - తెనాలి

పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పట్టణ త్రీటౌన్ పోలీసుల వివరాలు మేరకు.. స్థానిక పాండురంగ పేటలో పేకాడుతున్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఐదుగుర్ని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.5900 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి - తెనాలి

యువతి అదృశ్యంపై పట్టణ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నాజరు పేటకు చెందిన ప్రియ బుడంపాడులోని సెయింట్ మేరీస్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నారు. బుధవారం షాపింగ్ కోసం వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వరద బాధితులకు నిత్యావసరాల కిట్లు : గుంటూరు కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో వరద పరిస్థితులు, తీసుకుంటున్న సహాయక చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో అధికారులతో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ మంగళవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాల కారణంగా కృష్ణానదికి 11.4 లక్షల క్యూసెక్కుల నీరు విడుదలైందని, మంగళవారం ఉదయం 8.6 లక్షల క్యూసెక్కులకు తగ్గిందని తెలుపుతూ ఈనెల 3,4, 5వ తేదీలలో 65 మిల్లీ మీటర్ల వర్షాలు పడే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా వుండాలని చెప్పారు. కర్నాటక, తెలంగాణా రాష్ట్రాలలో పడే వర్షం కృష్ణా నదికి రావొచ్చని, అందువల్ల వరద ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులందరు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నీట మునిగిన కాలనీల్లో నీరు



టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ

తొలగించేందుకు చర్యలు తీసుకొని ప్రజలకు సౌకర్యాలు కల్పించాలన్నారు. వరద వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో నష్ట అంచనాలు పూర్తి చేయాలన్నారు. వరదలకు ప్రభావితమైన కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్లను అందించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో చక్కెర, కిలో పామోలిన్ ఆయిల్, కిలో బంగాళాదుంప, కిలో ఉల్లిపాయాలు ఒక కిట్‌గా చేసి బాధిత కుటుంబాలకు పంపిణి చేయడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. మంగళవారం సాయంత్రం నుండి కిట్లు పంపిణీ చేపట్టాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మత్స్యకారులు, చేనేత కుటుంబాలకు 50 కిలోల బియ్యం అందించాల్సి ఉందన్నారు. వరదల వల్ల జరిగిన పశు మరణాలను లెక్కించాలని, వరద ప్రభావిత ప్రాంతాలలోని పశుగ్రాసం సరఫరాకు పశు సంవర్ధక శాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరద నీరు తగ్గుముఖం పడుతున్నందున ఆ ప్రాంతాల్లో పారిశుధ్య పనులతో పాటు కాల్వల పూడికతీత పనులు చేపట్టాలని డిపిఒను ఆదేశించారు. వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న ఆటోలు , తోపుడు బండ్లను, హ్యాండ్ లూమ్ మగ్గాలు, మెటీరియల్, తయారైన వస్త్రాలు వరదల వల్ల నష్టం కలిగి వుంటే వాటిని కూడా నమోదు చేయాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వరద వల్ల దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు ఆర్అండ్‌బి, పంచాయితీరాజ్ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జేసీ ఎ.భార్గవ్‌తేజ మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లోని 8200 కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీకి కిట్లను సిద్ధం చేశామని, వాటిని ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద సిద్ధంగా ఉంచి పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఉద్యాన రైతుల విలవిల

(మొదటి పేజీ తరువాయి)

అంచనాలు ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. ఉద్యాన పంటలు పూర్తిగా నీటమునిగాయి. పసుపు, కంద, మునగ, బొప్పాయి, అరటి, దొండ,తమలపాకు, కూరగాయాల తోటలు, పూలతోటలతో పాటు పలు ఉద్యాన పంటలు ముంపునకు గురయ్యాయి.

ఉద్యాన పంటలకు ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడిపెట్టారు. కొన్ని పైర్లు కుళ్లిపోవడంతో వీటిని తొలగించి తిరిగి పంట వేసుకోవాలంటే ఖర్చులు అధికం అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పసుపు విత్తనం ఎకరాకు 30 వేల రూపాయలు కొనుగోలు చేశారు. ఇప్పటికే ఎకరాకు రూ .40 వేల వరకు పెట్టుబడి పెట్టామని రైతులు తెలిపారు. పంట నీటమునడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. కంద చే మ జాతికి చెందిన పంటలకు దాదాపు 30 వేల వరకు పెట్టుబడి పెట్టారు. కృష్ణా పరివాహక ప్రాంతంలోని అమరావతి, క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ మండలాల్లో 2600 ఎకరాల్లో వరి, 37 వేల ఎకరాల్లో పత్తి నీట మునిగాయి. డెల్టా ప్రాంతంలో వరి, మెట్ట ప్రాంతంలో పత్తి, మిర్చి, కంది, మినుము, పెసర, సోయాబిన్, పొగాకుతో పాటు అన్ని రకాల పైర్లకు నష్టం వాటిల్లింది. కృష్ణాపశ్చిమ డెల్టాలో 70 వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. 30 వేల ఎకరాల్లో పత్తి , 20 వేల ఎకరాల్లో మిర్చి పైరు ముంపునకు గురయింది. ఇతర పంటలు ప్రధానంగా పసుపు, కంద, అరటి, మినుము, పెసర తదితర పంటలు మరో 40 వేల ఎకరాల్లో సాగు చేయగా 20 వేల ఎకరాల్లో పైర్లకు తీవ్ర నష్టం వాటిల్లింది. పల్నాడు జిల్లాలో పత్తి, మిర్చి పంటలకు భారీ నష్టం వాటిల్లింది. పల్నాడు జిల్లాలో 40 వేల ఎకరాల్లో పత్తి, 20 వేల ఎకరాల్లో మిర్చి పైరు నీట మునిగి ఉరకెత్తింది. అలాగే ఉద్యాన పంటలు మరో 10 వేల ఎకరాల్లో నీట మునిగాయి.



మంగళ గిరి లో దెబ్బ తిన్న దొండ పందిళ్లు

వ్యవసాయ శాస్త్రవేత్తల పరిశీలన

వరద ముంపు బారిన పడిన పత్తి చేలను శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖాధికారులు మంగళవారం పరిశీలించారు. మండలంలోని పెదపరిమిలో వరద ముంపు బారినపడ్డ పత్తి చేలను లాంలోని ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ వి ఎస్ గోపాలస్వామి,శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్ వెంకటలక్ష్మి,డాక్టర్ ఐ ఉషారాణి,వ్యవసాయ శాఖాధికారి కె .రంజని పత్తి పొలాలను పరిశీలించారు. అనంతరం పత్తి పంట రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ముంపుకు గురై వడలిపోయిన పత్తి మొక్కలకు పైపాటుగా 25-30 కిలోల యూరియా, 20 కేజీ ల పొటాష్ లను నీరు తొలగించిన తరువాత వేసుకోవాలని వారు తెలిపారు.

వ్యవసాయ శాఖ అధికారుల పర్యటన

అధిక వర్షాలకు నీట మునిగి ఉన్న వరి పొలాలలో నీరు వారం రోజుల కంటే ఎక్కువ రోజులు ఉంటే పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉన్నదని వ్యవసాయ శాఖ శాస్త్రవేత్త పాలడుగు సత్యనారాయణ అధికారులకు తెలిపారు. మండలంలో అధిక వర్షాలకు ముంపుకు గురైన ప్రాంతాలను పరిశీలించేందుకు మంగళవారం పరిశీలనకు వచ్చిన వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్.ఢిల్లీరావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ అధికారుల బృందానికి పరిస్థితిని వివరించారు. పొలాల్లో నీరు తగ్గిన వెంటనే ఎకరాకు 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాషియం కలిప పొలంలో చెల్లాలని శాస్త్రవేత్త స్థానిక వ్యవసాయ శాఖ అధికారులకు రైతులకు సూచించారు.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

- పలు ప్రాంతాల్లో సిఐటియు పరిశీలన
- ఒక్కో ఇంటికి రూ.10 వేల తక్షణ సాయానికి డిమాండ్

ప్రజాశక్తి-తాడేపల్లి

కృష్ణానది వరదల వల్ల మహానాడు, సుందరయ్యనగర్ ప్రాంతాల్లో ఇళ్లు దెబ్బతిన్న వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు రాష్ట్ర నాయకత్వం ప్రభుత్వాన్ని కోరింది. సిఐటియు రాష్ట్ర బృందం మంగళవారం రాత్రి ఆయా ప్రాంతాల్లో పర్యటించింది. బాధితులను అడిగి నాయకులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణానదికి విజయవాడ వైపు రిటైనింగ్ గోడ నిర్మించినట్లు ఇటు వైపు కూడా నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణ సాయం కింద ప్రభుత్వం ప్రతి ఇంటికీ రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్లు నష్టపోయి సర్వస్వం కోల్పోయిన వారికి ప్రభుత్వం వెంటనే ఎన్యురేషన్ పూర్తి చేసి తగిన నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. వరదలు తగ్గినా అంటువ్యాధుల భయం స్థానికులను



పట్టి పీడిస్తుందని తెలిపారు. వెంటనే ప్రభుత్వ అధికారులు పారిశుధ్యం మెరుగుదలకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరిశీలనలో రాష్ట్ర నాయకులు వి.ఉమామహేశ్వరరావు, కె.ధనలక్ష్మి, కె.ఉమామహేశ్వరరావు, తాడేపల్లి సిఐటియు నాయకులు వి.దుర్గారావు, రామచంద్రరావు, శ్రీను, ఏడుకొండలు, ఎస్‌కె బాష, రేణుక, లక్ష్మి, ఎన్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శాంతించిన కృష్ణమ్మ - తగ్గుతున్న వరద

రెండ్రోజుల నుండి ఉగ్రరూపం దాల్చిన కృష్ణమ్మ మంగళవారం ఉదయం నుంచి గంటగంటకూ తగ్గుతూ వస్తోంది. ఇళ్లు, మన్ను ఏకం చేసిన వరద నీరు ఇళ్లలో నుంచి బయటకు వెళ్లడంతో సుందరయ్యనగర్, మహానాడు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద మంగళవారం సాయంత్రానికి 7.24 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా అదే స్థాయిలో బ్యారేజీకి ఉన్న 70 గేట్లు ఎత్తి సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. కృష్ణా పశ్చిమ, తూర్పు, ఏలూరు, బందరు, రైవస్ కాల్వలకు 1700 క్యూసెక్కులను విడుదల చేస్తున్నట్లు బ్యారేజీ ఎఇ దినేష్ తెలిపారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 17 అడుగుల ఎత్తు నీరు ప్రవహిస్తుండగా రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది.

నదిలో దూకిన వివాహిత

ప్రాణాలు కాపాడిన ట్రాఫిక్ పోలీసులు



ప్రజాశక్తి - తాడేపల్లి

నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన వివాహితను ట్రాఫిక్ పోలీసు సిబ్బంది కాపాడిన ఘటన మంగళవారం తాడేపల్లి మండలంలో చోటు చేసుకుంది. వివరాల మేరకు.. మంగళవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో చిలకలూరిపేటకు చెందిన వివాహిత తన భర్తతో గొడవపడి ఇంటి నుండి విజయవాడకు వచ్చి తాడేపల్లిలో ఉన్న బంధువులకు విషయాన్ని తెలిపారు. ఆపై తన తమ్ముడితో విజయవాడ నుండి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. కనకదుర్గమ్మ వారధిపై వస్తుండగా 5వ పిల్లర్ వద్దకు రాగానే వాహనం నుండి దిగి ఆత్మహత్యకు పాల్పడింది. చూస్తుండగానే నదిలోకి దూకింది. వెంటనే అక్కడే ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఎస్. పాపినాయుడు, హోంగార్డు రెహ్మాన్ సదరు సమాచారాన్ని ట్రాఫిక్ ఎస్ఐ నారాయణకు తెలియజేయగా వెంటనే స్పందించిన ఎస్ఐ నారాయణ తన సిబ్బంది, పాతూరు గ్రామస్తులను అప్రమత్తం చేశారు. వరదలో ప్రాతూరు వరకు కొట్టుకుపోయిన సదరు మహిళని ప్రాణాలతో రక్షించి మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. తాడేపల్లి ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది సకాలంలో స్పందించడం వలన తన భార్య ప్రాణాలతో ఉందని భర్త కృతజ్ఞతలు తెలిపారు.

వరద బాధితుల సహాయంలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఇటీవల కాలంలో కురిసిన భారీ వర్షాలకు ముంపుకు గురైన విజయవాడ పట్టణంలో సిఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం మంత్రి కింజరపు అచ్చం నాయుడుతో కలిసి ముంపుకు గురైన ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు అక్కడ నివసిస్తున్న ప్రజలకు మంచినీరు పాలు భోజనం అందించారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకునేలా విగ్రహ కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని నరసరావుపేట డిఎస్పి కె.నాగేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, అగ్నిమాపక, విద్యుత్, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారన్నారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడానికి పోలీసు శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టిందన్నారు. గణేష్ మండపాలను తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. సమన్వయం కోసం ముందస్తుగా విగ్రహ కమిటీ పూర్తి వివరాలు అందించాలని తద్వారా వైభవంగా నిర్వహించడానికి ఉపయోగపడుతుందన్నారు. సబ్ డివిజన్ పరిధిలో పట్టణ గ్రామీణ ప్రాంతాలలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై పోలీస్ శాఖ నిఘా ఉంటుందని గణేష్ నవరాత్రి ఉత్సవాలు మొదటి రోజు నుండి నిమజ్జనం వరకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రశాంత వాతావరణంలో అవాంఛనీయ సంఘటనలు తావు లేకుండా నిర్వహించాలన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలలో భాగంగా విద్యుత్ తీగలకు తగల కుండా ఎత్తు తక్కువ ఉండే విగ్రహాలు ఏర్పాటు చేయాలని మండపాల్లో మైక్ ఏర్పాటుకు పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని చెప్పారు. ప్రతి మండపం వద్ద అవసరమైన మేర బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా రాజకీయ పార్టీల పాటలు జెండాలు పెట్టడం ఇతర వివాదాలు లేకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో పండుగ జరుపుకోవాలన్నారు.

ప్రభుత్వ లేఔట్లలో దొంగతనాలను అరికట్టాలి



ప్రజాశక్తి - విజయపురిసౌత్

ప్రభుత్వ లేఔట్లలో దొంగతనాలను అరికట్టాలని హౌసింగ్ అధికారి డిఈ బాలాజీ ఉన్నతాధికారులను కోరారు. మంగళవారం ఆయన మాచర్ల తహశీల్దారుకు, మున్సిపల్ కమిషనర్‌కు, పట్టణ సీఐకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హౌసింగ్ డిఈ బాలాజీ నాయక్ మాట్లాడుతూ 2021-22 సంవత్సరంలో మాచర్ల పట్టణంలో 21 లేఔట్లలో పేదలకు పక్కా గృహాల నిర్మాణానికి ఏర్పాటు చేశారని, నీటి కోసం 50 బోర్లు వేశారని తెలిపారు. లేఅవుట్లలో ఇల్లు కట్టుబడి నిమిత్తం తోలిన ఇసుక, సిమెంటు, ఇనుము, తెల్లవారేకల్లా దొంగతనానికి గురువుతున్నాయని, అలాగే మంచినీటి కోసం ఏర్పాటు చేసిన మోటార్లు సైతం దొంగతనానికి గురవుతున్నాయని వాపోయారు. ముఖ్యంగా లింగాపురం కాలనీలో రెండు రోజుల క్రితం ఇల్లు కట్టుబడి నిమిత్తం ఏర్పాటు చేసిన ఇసుక సిమెంట్ ఇనుము దొంగతనం గురైనట్లు డిఈ తెలిపారు. సమస్యను సంబంధిత అధికారులు దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇకపై ఈ సమస్యను జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు బాలాజీ నాయక్ తెలిపారు. లింగాపురం లేఅవుట్‌ను తన సిబ్బందితో కలిసి పరిశీలించిన అనంతరం అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు.



ట్యాంకర్‌ను పరిశీలిసుతన్న పోలీసులు

ఆయిల్ ట్యాంకర్‌లో మంటలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

జాతీయ రహదారిపై ఓ మినీ ఐఓసీ ఆయిల్ ట్యాంకర్‌లో వెనుక వైపు మంటలంటుకుంది. సకాలంలో స్పందించి ఫైర్ హెక్సింగ్ విషెస్ సహాయంతో మంటలు ఆర్పివేశారు. ఈ ఘటన మంగళవారం మంగళగిరి మండలంలో చోటుచేసుకుంది. వివరాలకు.. విజయవాడ ఆటోనగర్ నుండి గుంటూరు వైపు మినీ ఐఓసీ ఆయిల్ ట్యాంకర్ బయలుదేరింది. జాతీయరహదారి వెళ్తూ మంగళగిరి, ఖాజా గ్రామం సమీపానికి రాగానే వెనుక భాగం ఎడమ చక్రం టైర్ డ్రమ్ము పట్టివేయడంతో మంటలంటుకుంది. దీన్ని గమనించిన డ్రైవర్ హుటాహుటిన లారీని ఆపి అధికారులకు సమాచారమిచ్చాడు. పోలీసులు, టోల్గేట్ వారు వెంటనే అక్కడకు చేరుకొని మంటలను అదుపు చేశారు. ఆయిల్ ట్యాంకర్ ఖాళీగా ఉండటం వల్ల పెను ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు. ఆయిల్ ట్యాంకర్స్, గ్యాస్ వంటి వాహనాలను రవాణా చేయు వాహనదారులు తప్పనిసరిగా ఫైర్ ఆస్టింగ్ మిషన్స్ వాళ్ళ వాహనాల్లో ఉపయోగించాలని పోలీసు అధికారులు సూచించారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 45,449
మిర్చి ఎగుమతి	: 42,589
మిర్చి నిల్వ	: 21,569

మిర్చి ధరలు

	రూపాయలలో
334	7,500 - 16,000
నెం.5	8,000 - 13,500
273	9,600 - 13,000
341	8,000 - 14,500
4884	8,900 - 11,500
నాన్ ఎసి	
తేజ	7,500 - 18,600
బడిగి	8,000 - 13,500
దేవనూరు డీలక్స్	8,000- 13,700
తాలుకాయలు	5,000 - 12,000
ఎసి	
334	8,200 -14,000
నెం.5	8,000 - 13,000
273	10,500 - 11,000
341	9,500 - 12,500
4884	11,000 - 11,500
సూపర్ 10	12,000 -12,000
తేజ	7,500 - 18,500
బడిగి	8,000 - 13,000
దేవనూరు డీలక్స్	10,000- 16,000
తాలుకాయలు	4,500 - 11,500

కోడి పందేంలో 15 మంది అరెస్టు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని అచ్చమ్మపాలెంగ్రామం శివారు పొలాలలో కోడి పందేలు వేస్తున్న 15 మందిని అరెస్టు చేసినట్లు నరసరావుపేట రూరల్ సిఐ పసుపులేటి రామకష్ణ అన్నారు. సిఐ మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు డిఎస్పి కె.నాగేశ్వరరావు ఆదేశాలతో నరసరావుపేట రూరల్ ఎస్ఐ చల్లా కిషోర్ సిబ్బంది ఆధ్వర్యంలో కోడి పందేలు జరుగుతున్న శిబిరంపై దాడి చేశారు. 15 మందిని అదుపులోకి తీసుకుని 10 పందెం కోళ్లు పట్టుకుని, 15 ద్విచక్ర వాహనాలు, రెండుకార్లు సీజ్ చేసి, రూ.33 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. కోడి పందేలు నిర్వహిస్తున్న తిరుపతి రాజు, మిగిలినవారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.





41474 ఎకరాల్లో పైర్లు మునక

ప్రజాశక్తి - క్రోసూరు

భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో క్రోసూరు డివిజన్‌లో 41474 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ఏడీఏ హనుమంతరావు మంగళవారం తెలిపారు. డివిజన్ పరిధిలోని అమరావతి, క్రోసూరు, అచంపేట, బెల్లంకొండ మండలాల్లో మొత్తం 2667 ఎకరాల్లో వరి, 38807 ఎకరాల్లో పత్తి నీట మునిగిందన్నారు. వరిపైరుకు సంబంధించి క్రోసూరు మండలంలో 915 ఎకరాలు, బెల్లంకొండ మండలంలో 567 ఎకరాలు, అచంపేట మండలంలో 132 ఎకరాలు, అమరావతి మండలంలో 1052 ఎకరాలు ముంపుబారిన పడ్డట్టు చెప్పారు. పత్తికి సంబంధించి మండలాల వారీగా క్రోసూరు 9595 ఎకరాలు, బెల్లంకొండ 3140 ఎకరాలు, అచంపేట 10335 ఎకరాలు, అమరావతి 15737 ఎకరాలు నీట మునిగిందన్నారు. నష్టంపై ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. రైతులకు ఎప్పటికప్పుడు సూచనలిస్తున్నామని, పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది సెలవులు పెట్టకుండా, రైతులకు అండగా నిలవాలని కోరారు.



ముంపు ప్రాంతాల్లో కన్నా పరిశీలన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

చంద్రబాబు ఆదేశాల మేరకు విజయవాడలోని వరద ముంపు ప్రాంతమైన 15వ డివిజన్‌లో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం పరిశీలించారు. పునరావాస కేంద్రాల వద్దకు వెళ్లి ఆహార పొట్లాలు, పాలు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. వరద బాధితులను చంద్రబాబు ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని చెప్పారు. అనంతరం అధికారులతో కలిసి వరద ముంపు కాలనీల్లో పరిస్థితి పరిశీలించి బాధితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.



క్రీడా పోటీల్లో 'నారాయణ' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు పలు క్రీడల్లో ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ శేషగిరిరావు మంగళవారం తెలిపారు. వి.కిషోర్‌బాబు, పి.జ్యోతిప్రకాష్ వాలీబాల్ జాతీయస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించగా కె.పవన్‌కళ్యాణ్, టి.విష్ణు క్రికెట్‌లో ద్వితీయ స్థానం సాధించారని చెప్పారు. వీరిని ప్రిన్సిపాల్‌తోపాటు ఎజిఎం లక్ష్మణరెడ్డి, ఏవో స్వామి, పిఇటి కృపారావు, ఉపాధ్యాయులు అభినందించారు.



మాచర్ల మండలంలో పైర్లను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి



అమరావతి మండలం పెదమద్దూరులో దెబ్బతిన్న పైరును ఎమ్మెల్యే ప్రవీణ్‌కు చూపుతున్న రైతు

ముంపు పొలాల్లోకి ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

వర్షాలకు వాగులు, చెరువులు పొంగి పంట నష్టం వాటిల్లిందని, బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మాచర్ల, వెల్దుర్తి మండలాల్లోని మండాది, కొత్తపల్లి గ్రామాల్లో ముంపు బారిన పడ్డ పొలాలను ఆయన మంగళవారం పరిశీలించారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యవసాయశాఖ అధికారులు కూడా రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు ఇవ్వాలని చెప్పారు. మళ్లీ వర్షాలు పడతాయనే హెచ్చరికల నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా అందుబాటులో ఉండేలా చూస్తామని చెప్పారు. నిద్రాహారాలు మానుకుని వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రాణనష్టం జరగకుండా పని చేస్తున్న సిఎం చంద్రబాబును ఇంగితజ్ఞానం లేకుండా జగన్‌మోహన్‌రెడ్డి విమర్శిస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. గత ప్రభుత్వ ఇలాంటి సందర్భాల్లో ఎలా వ్యవహరించిందో ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. చంద్రబాబును విమర్శిస్తే సహించేది లేదని, దేహశుద్ధి తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎడిఎ జగదీశ్వరరెడ్డి, ఎఓ లక్ష్మారెడ్డి, టిడిపి నాయకులు కె.శివారెడ్డి, మదార్‌సాహెబ్, జె.అక్కిరెడ్డి, అన్వర్‌బాషా, కె.దుర్గారావు, ఎం.వెంకటరామిరెడ్డి, కె.అనిల్‌కుమార్, జి.శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

రాజధానిని కలుపుతూ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణాన్ని గత టిడిపి ప్రభుత్వం చేపడితే వైసిపి ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేసిందని, అందుకే పెదమద్దూరు గ్రామం ముంపునకు గురైందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. భవిష్యత్తులో బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. పెదమద్దూరులోని ముంపు ప్రాంతాల్లో మంగళవారం పరిశీలించిన ఎమ్మెల్యేకు మాట్లాడుతూ మూడ్రోజులుగా వరద నీటిలోనే లోతట్టు ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కాస్త వరదలు తగ్గుముఖం పట్టడం ఊరటనిస్తుందన్నారు. 60 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా వరద పెదకూరపాడు నియోజకవర్గంలో వచ్చిందన్నారు. మరో రెండు రోజుల్లో మళ్లీ వర్షాలు పడతాయన్న వార్తల నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ముంపునకు గురైన కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించి పూర్తి స్థాయి సౌకర్యాలను కల్పించినట్టు చెప్పారు. వరదల కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కర్నీ ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. నిల్వ ఉన్న నీటితో అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రతి ప్రాంతంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

అధికారులతో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు జూమ్ కాన్ఫరెన్స్

ప్రజాశక్తి - వినుకొండ

నియోజకవర్గ పరిధిలో విపత్తు నిర్వహణలో సమన్వయలోపం రానివ్వొద్దని అధికారులకు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు. ముఖ్యమైన విభాగాల అధికారులందరూ అన్ని వేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు భరోసా కల్పించాలన్నారు. ఈ మేరకు అధికారులతో ఆయన మంగళవారం ఆన్‌లైన్ ద్వారా సమీక్షించారు. వ్యవసాయ శాఖ, రెవెన్యూ విభాగం కలిసి పంటనష్టం అంచనాలను వేగంగా రూపొందించాలన్నారు. నీటమునిగిన పొలాలను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. పంచాయతీరాజ్ రాజ్ విభాగం తరపున గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులు, రక్షితనీరు, బ్లీచింగ్ ఇతర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారులు ఎక్కడైనా గుంతలు, కోతకు గురైతే మరమ్మతులు చేయాలని చెప్పారు. ఇళ్లు కూలిపోవడం, దెబ్బతింటే పరిహారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే విషజ్వరాలు విపరీతంగా పెరుగుతున్న పరిస్థితుల్లో వర్షాలూ జతకలవడంతో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తపడాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, ఔషధాలు అందుబాటులో ఉంచాలని, గ్రామాల్లో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ అవసరమైతే వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. చెరువులు తెగిపోవడం, కాల్వలకు గండ్లు పడటం లాంటివి ఉంటే వాటి మరమ్మతులకు చర్యలు చేపట్టాలన్నారు. వీటిపై ముందుగానే సమాచారం సేకరించాలన్నారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ ఏర్పాట్లు చేయాలని, సహాయ చర్యల్లో పోలీసులు తోడుగా ఉండాలని కోరారు. ప్రజల నుంచి ఏమైనా ఫిర్యాదులు వస్తే తక్షణమే స్పందించాలన్నారు.

ఒకవైపు పరామర్శలు.. మరోవైపు కూల్చివేతలు



ప్రజాశక్తి - అచ్చంపేట

అధిక వర్షాలకు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయని బాధితులను స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పరామర్శిస్తున్న తరుణంలో మరోవైపు అక్రమ నిర్మాణాలంటూ పేదల ఇళ్లను అధికారులు కూల్చివేయించిన ఘటన మండల కేంద్రమైన అచ్చంపేటలో మంగళవారం చోటుచేసుకుంది.

బాధితుల వివరాల ప్రకారం.. గ్రామంలోని చామర్రు రోడ్డులో రహదారి వెంబడి ప్రభుత్వ భూమిలో 40 ఏళ్లుగా 200 కుటుంబాల వారు జీవిస్తున్నారు. ఈ క్రమంలో ఆ రహదారికి వెనుక బాగానున్న పంట పొలాలు వేణుగోపాల్ అనే వ్యక్తి వ్యక్తి సుమారు పదెకరాలు కొనుగోలు చేశారు. 2015 నుండి పంట పొలానికి దారి లేదంటూ దరఖాస్తు చేశారు. ఈ క్రమంలో అప్పటి తహశీల్దార్‌కు వేణుగోపాలతో పాటు మరో ముగ్గురు రైతులతో పొలానికి వెళ్లే దారి కోసం అర్జీ ఇప్పించారు. రెవెన్యూ అధికారులు 11 రహదారులను కేటాయించారు. కొన్ని దార్లకు 10 అడుగులు, మరికొన్ని దార్లకు 12 అడుగులు కేటాయించగా రెండు దార్లకు మాత్రం 60 అడుగుల చొప్పున కేటాయించారు. ఇందుకు అడ్డుగా ఉన్న చిలకా రవి అనే నిరుద్యోగికి చెందిన నిర్మాణంలో ఉన్న ఇంటిని కూల్చివేశారు దీనిపై బాధితులందరూ కోర్టును ఆశ్రయించారు. మరోవైపు ఇల్లు కూల్చారన్న దిగులుతో రవి మృతి చెందారు. ప్రస్తుతం ఈ వివాదానికి సంబంధించి కేసు కోర్టులో కొనసాగుతోంది. కొంతకాలం మరలా దానికి రహదారులు ఆక్రమణ గురవుతున్నాయని జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు, పోలీసులను తీసుకొని వచ్చి దౌర్జన్యానికి దిగటంతో కాలనీవాసులు, వారందరూ ధర్నాకు దిగడంతో రెవెన్యూ అధికారులు వెనుదిరిగారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం రెవెన్యూ పోలీస్ సిబ్బంది ఆక్రమణ జరుగుతున్నాయని వేణుగోపాల్ వెంటబెట్టుకుని వచ్చారు. నిర్మాణంలో ఉన్న గౌతు కట్ల శేషములకు చెందిన ఇంటిని కూల్చివేశారు. పక్కనే ఉన్న రెంటపాళ్ల పుల్లమ్మ నివాసముంటున్న ఇంటిని కూల్చే ప్రయత్నం చేయటంతో కాలనీవాసులందరూ ఎదురు తిరిగారు. వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు, ఆర్.వెంకటేశ్వ రరావు, షేక్ హసన్ తదితరులు బాధితుల తరఫున అధికారులతో మాట్లాడారు. నోటీసులు ఇవ్వకుండా ఇటువంటి చర్యలు పాల్పడటం సరికాదని హెచ్చరించడంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు వెనుదిరిగారు. రైతులకు పొలం దారుల పేరుతో 11 దారులు ఇవ్వటం, అది కూడా వేణుగోపాల్ పొలానికి వెళ్లేందుకు 60 అడుగుల దారిని కేటాయించటం ఏమిటని రవిబాబు ప్రశ్నించారు. ఇదిలా ఉండగా ఎన్నో ఏళ్లుగా పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వకుండా, ఇంటి పన్నులు కట్టించుకోనీ కుండా పొలం యజమానులు రాజకీయ ప్రాభల్యంతో తమను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని కాలనీ వాసులు వాపోయారు.





ఇంటిని కూలుస్తున్న పొక్లెయినర్.. డిప్యూటీ తహశీల్దార్‌తో మాట్లాడుతున్న రవిబాబు

వరద బాధితులకు చేయూత



విజయవాడకు జిఎంసి ఆహారపదార్థాలు

ప్రజాశక్తి-గుంటూరు

విజయవాడలో ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజలకు గుంటూరు నగరపాలక సంస్థ అందించే ఆహార పదార్థాలను అత్యంత జాగ్రత్తగా, పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేసి అందించేలా పర్యవేక్షణ అధికారులు శ్రద్ధ చూపాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక నాజ్ సెంటర్‌లోని రిజర్వాయర్ నుండి విజయవాడకు పంపుతున్న 1 లక్ష ఆహార, అల్పాహార పదార్థాల ప్యాకెట్స్, వాహనాలను కమిషనర్ పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జిఎంసి ఆదేశాల మేరకు మంగళవారం టమాటా బాత్, వెజ్ బిర్యాని, సాంబార్ అన్నం, పెరుగన్నం, పాలు, బిస్కెట్స్, వాటర్ బాటిల్స్, బ్రెడ్ ప్యాకేట్స్‌ని పూటకి 1 లక్ష వంతున అందిస్తున్నామన్నారు. ఆహార పదార్థాల తయారీ, సరఫరా చేసే క్యాటరింగ్ ఏజెన్సీలు పరిశుభ్రమైన వాతావరణంలో, నాణ్యమైన సరుకులు వినియోగిం చాలన్నారు. వరద ముంపుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు అందించే ఆహార పదార్థాలలో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆహార పదార్థాల సరఫరా, పంపిణీకి కేటాయించబడిన పర్యవేక్షణ అధికారులు క్యాటరింగ్ ఏజన్సీలతో సమన్వయం చేసుకొని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ కోటేశ్వరరావు, ఏఈలు సునీల్ కుమార్, పవన్ కుమార్ పాల్గొన్నారు.



ఆహారం తరలిస్తున్న వాహనంతో సిబ్బంది

వరద బాధితులకు భాష్యం చేయూత

ప్రజాశక్తి-గుంటూరు :వరద బాధితులకు ప్రతి ఒక్కరూ సహాయ పడాలని భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ కోరారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం భాష్యం విద్యా సంస్థల తరపున 70వేల పులిహోర, పెరుగన్నం ప్యాకెట్లు పంపినట్లు రామకృష్ణ తెలిపారు. ఈ ప్రకృతి వైపరిత్యం వల్ల ప్రజల కష్టాలు మనసును కలచివేసిందన్నారు. పులిహోర, పెరుగున్నం ప్యాకెట్ల పంపిణీలో భాష్యం విద్యా సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ భ్రమర ట్రస్ట్ అధినేత వితరణ

ప్రజాశక్తి -గుంటూరు జిల్లా ప్రతినిధి

విజయవాడ వరద బాధితులకు శ్రీ భ్రమర ట్రస్ట్ అధినేత గళ్ళా రామ చంద్రరావు సహకారంతో అన్నార్తులకు 10,000 భోజన ప్యాకెట్లు 20000 వాటర్ బాటిళ్ల పంపిణీ చేశారు. గుంటూరు నుంచి విజయవాడకు తరలిస్తున్న ఆహార పానియాలకు సంబంధించిన వాహనాలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి పచ్చ జెండా ఊపి పంపారు. ఈ సందర్భముగా గళ్ళా మాధవి మాట్లాడుతూ విపత్తు సమయంలో బాధితులకు అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. టిడిపి నాయకులు ముత్తినేని రాజేష్,మందలపు బంగారు బాబు,వై. సాంబశివరావు, పి.సుబ్రమణ్యం,వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.





పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన సబ్‌కలెక్టర్

ప్రజాశక్తి - కొల్లిపర

కొల్లిపర మండలం హనుమాన్ పాలెం గ్రామంలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని తెనాలి సబ్ కలెక్టర్ సంజనాసింహ మంగళవారం పరిశీలించారు. వరద బాధితులకు అందుతున్న వసతుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పజాశక్తి - కొల్లిపర

అధిక వర్షాలకు, వరద ప్రాంతాల్లో వ్యాధులు విజంభించే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని డి ఎం హెచ్ ఓ కొర్ర విజయ లక్ష్మి అన్నారు మంగళవారం కొల్లిపర మండలంలోని తూములూరు హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్లకు వైద్య సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందజేశారు అనంతరం వరద బాధితులకు పండ్లు పంపిణీ చేశారు.

వరద బాధితులకు ఎమ్మెల్యే సాయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

వరదలో చిక్కుకొని తీవ్ర ఇబ్బందులు పడుతున్న విజయవాడ చిట్టీనగర్ 47వార్డు ప్రజలకి ప్రత్తిపాడు నియోజక వర్గ ఎమెల్యే డాక్టర్ బూర్ల రామాంజనేయులు మరియు నియోజకవర్గం నుండి సుమారు 50మంది నాయకులు కార్యకర్తలు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. బాధితులకు 10000 భోజనం ప్యాకెట్లు మరియు మంచినీటీ బాటిల్స్ అందించటం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు మీడియా కోర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరావు, గుంటూరు జిల్లా అధికార ప్రతినిధి కల్లూరి శ్రీనివాస్, గుంటూరు రూరల్ మండల పార్టీ అధ్యక్షులు ఇమ్మడి లీలా మల్లేశ్వరావు, తిమ్మాపురం సర్పంచ్ కల్లూరి శ్రీనివాస్, ఐటీడీపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచుమర్తి శేషు, ప్రత్తిపాడు ఐటీడీపి ప్రధానకార్యదర్శి కల్లూరి అవినాష్, గుంటూరు రూరల్ ఐటీడీపి అధ్యక్షుడు గుంటుపల్లి కుమారస్వామి, పాలపర్తి గ్రామ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల శ్రీధర్, తదితర నాయకులు పాల్గొన్నారు.



వరద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

650 మందికి కూరగాయలు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి: వరద ప్రభావిత ప్రాంతమైన రత్నాలచెరువులోని 21 వార్డులలో మంగళవారం టీడీపీ నాయకులు 4.5 టన్నుల కూరగాయలు పంపిణీ చేశారు. వరదల కారణంగా జీవనోపాధి కోల్పోయిన బాధితులను ఆదుకోవాలన్న సీఎం పిలుపు మేరకు పిఠాపురం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్?చార్జ్ ఎస్‌విఎస్ఎన్ వర్మ 4.5 టన్నుల కూరగాయలను కొనుగోలు చేసి వాహనం ద్వారా మంగళగిరికి పంపించారు. టీడీపీ నాయకులు ప్యాకింగ్ చేసి ఇంటింటికీ వెళ్లి బాధితులకు పంపిణీ చేశారు.

ప్రజాశక్తి - తుళ్లూరు : వరదల వల్ల నిరాశ్రయులయులైన వారికి మండల తెలుగు యువత ఆధ్వర్యంలో మంగళవారం ఆహార పొట్లాలు అందజేశారు. మంగళవారం తుళ్లూరు రాయపూడి,హరిశ్చంద్ర పురంలో వరద బాధితులకు మండల తెలుగు యువత అధ్యక్షులు మూల్పూరి నరేష్, కార్యకర్తలతో కలిసి ఆహార పొట్లాలు అందించారు. సాధారణ పరిస్థితులు నెలకొనేంత వరకు బాధితులకు అండగా ఉంటామని నరేష్ చెప్పారు.

3 వేల మందికి భోజనాలు

ప్రజాశక్తి - కొల్లిపర

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మాత్యులు నాదెండ్ల మనోహర్ స్ఫూర్తితో కొల్లూరు వరద బాధితులకు కొల్లిపర జన సైనికులు భీమవరపు వేణుగోపాల్ రెడ్డి భీమవరపు కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 3,000 మందికి భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు.



వరద బాధితులకు ఆహారపదార్థాలు పంపిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి ఆధ్వర్యంలో వెయ్యిమందికి భోజనాలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ :ఎం టి ఎం సి పరిధిలోని వడ్డేశ్వరం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కాట్రగడ్డ మధుసూదన రావు ఆర్థిక సహాయంతో వెయ్యి మంది తాడేపల్లి పట్టణ వరద బాధితులకు భోజనం ప్యాకెట్లను మంగళవారం టిడిపి నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా కాట్రగడ్డ మధుసూదన్ రావు మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు నిరాశ్రయులైన వారికి మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్ స్ఫూర్తితో భోజనం ప్యాకెట్లు అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఈపూరి బాబు, మద్దినేని సుబ్రహ్మణ్యం, గుంపెన నాగేశ్వరరావు, వంగూరు బీముడు, కాట్రగడ్డ గోపాలకృష్ణయ్య పాల్గొన్నారు.

నీటిలో నానుతున్న పైర్లు

ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం అంటున్న రైతులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

వరద ప్రవాహం తగ్గుముఖం పట్టినప్పటికీ చేలలోల నిండిపోయిన బురదతో రైతుల్లో ఆందోళన తగ్గలేదు. కృష్ణా నది పరివాహక ప్రాంతంలోని లంక పొలాలకు చెందిన రైతులు వరద నీరు తగ్గుముఖం పట్టినప్పటికీ చేలలో నీరు బురద ఇప్పుడే తగ్గవని వారం రోజులు పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పసుపు, అరటి, కంద, చేమ లాంటి దుంప జాతికి చెందిన చేలు క్రుళ్ళి పోతా యంటున్నారు. కూరల తోటలు మినప చేలతో సహా రోటవేటర్ వేసుకుని తిరిగి వేరే పంటలు వే న ం కో వ ల ని ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు విత్తనం ఎకరాకు రూ. 30 వేలు పెట్టి కొన్నామని, నాటడం దున్న డం మొత్తం కలిపి ఇప్పటివరకు ఎకరాకు రూ .40,000 పెట్టుబడి పెట్టమని తెలిపారు. అరటి కూడా దాదాపు ఎకరాకు 40 వేల రూపాయలవరకు పెట్టుబడి పెట్టి ఉన్నారు. కంద చే మ జాతికి చెందిన పంటలకు దాదాపు 30 వేల వరకు పెట్టుబడి పెట్టి ఉన్నారు. కూరగాయలతో సహా అన్ని రకాల పంటలు పూర్తిగా నష్టపోతాయని తెలిపారు. వీర్లపాలెం పెద్ద కొండూరు గొడవర్రు గ్రామాల పరిధిలో దాదాపు 900 ఎకరాలు లంక పొలాలు ఉన్నాయి. వరదలకు అన్ని ముంపు గురయ్యాని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.





మెరిట్ స్కాలర్‌షిప్ దరఖాస్తుకు17 వరకు గడువు

ప్రజాశక్తి-గుంటూరు : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు (డిసెంబర్ 8న) దరఖాస్తు చేసుకోవటానికి గడువును సెప్టెంబర్ 17 వరకూ పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసు కోవాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ, కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3.5లక్షల లోపు ఉన్న వారు అర్హులని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమయంలో విద్యార్థి ఆధార్ కార్డులో ఉన్న విధంగానే విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తండ్రిపేరు నమోదు చేయాల్సి ఉంటుందని, ఎటువంటి ధృవపత్రాలు అవసరం లేదన్నారు.పరీక్ష రాసే సమయానికి ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. పరీక్ష ఫీజు ఓసి, బిసిలకు రూ.100లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50లు సెప్టెంబర్ 10వ తేదీ నుండి ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇచ్చిన ఎస్‌బిఐ కలెక్ట్ లింకు ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌నుగానీ, డిఇఒ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలి

తెనాలిలో కమిషనర్‌కు సిఐటియు నాయకుల వినతి

ప్రజాశక్తి-తెనాలిరూరల్



వర్షపునీరు కారణంగా రోడ్లపై ఏర్పడిన గుంటలు, పగుళ్లను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నకు సిఐటియు తెనాలి కమిటీ నాయకులు కొల్లిపర బాబు ప్రసాద్, షేక్ హుస్సేన్ వలి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. రోడ్లపై ఏర్పడ్డ గుంతలు కారణంగా తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని బాబు ప్రసాద్ విన్నవించారు. ఈ విషయంలో మానవీయకోణంలో ఆలోచించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రమాదవశాత్తు ఒక కుటుంబంలో యజమాని గాయపడితే ఆ కుటుంభం మొత్తం రోడ్డెక్కాల్సిన పరిస్థితి నెలకుంటుందన్నారు. పట్టణంలో ఎఎస్ఎన్ పెట్రోల్ బంక్ రోడ్డు, ఆలపాటి రాజేంద్రప్రసాద్ వారధి రోడ్డు, యడ్ల లింగయ్య పెట్రోల్ బంక్ రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, చెంచుపేట రావి రవీంద్రనాథ్ రోడ్డు, బస్టాండ్ సమీపంలో రోడ్లన్నీ గుంతలు మయమయంగా మారడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. రూ 20 లక్షలు మున్సిపల్ నిధులను రోడ్లపై ఏర్పడ్డ గుంతల మరమత్తులకు కేటాయించడం జరిగిందని కమీషనర్ వెల్లడించారన్నారు. గుత్తేదారులు టెండర్లకు రాకపోవడంతో రోడ్ల మరమ్మత్తులకు ఆటంకం కలుగుతుందన్నారు. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ తెలియజేసారన్నారు.



చెన్నకేశవ నగర్‌లో నీళ్లల్లోనే పేదల ఇళ్లు

ప్రజాశక్తి - దుగ్గిరాల : గత నాలుగు రోజులుగాకురిసిన వర్షాలకు చెన్నకేశవ నగర్ లో నివాసం ఉంటున్న పేదల ఇళ్లల్లోకి నీళ్లు చేరి నాలుగైదు రోజులు అవుతున్న ఇప్పటికే నీళ్లు బయటికి వెళ్ళనిపరిస్థితి ఉందని సిపిఎం మండల కార్యదర్శి జెటి బాలరాజు తెలిపారు. మంగళవారం ఆ ప్రాంతంలో పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇళ్లలో నిలబడలేని పరిస్థితి ఉందని, వాసన, దోమలు రాత్రిపూట పాములు తేళ్లు కూడా వస్తున్నాయని పేదవారు ఆందోళన చెందుతున్నారన్నారు. రెండు రోజులు శిబిరములో మూడు పూటల భోజనం పెట్టి పంపి చేశారని, ఈ వర్షాలు కారణంగా పనులు లేక నానా అవస్థలు పడుతున్నామని కనీసం 10 కేజీలు బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేయాలని పేదలు కోరుతున్నారు. కార్యక్రమంలో జి శ్రీనివాసరావు మల్లేశ్వరి శివ కుమారి తిరుపతమ్మ లక్ష్మి బుజ్జి గిరిజ బాణావత్ బుజ్జి బాయ్ పాల్గొన్నారు.

పత్తిపొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు


పంట పొలాలను పరిశీలించి రైతులను అడిగి తెలుసుకుంటున్నశాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - నాదెండ్ల

నాదెండ్ల గ్రామంలో ఇటీవల కురిసిన అధిక వర్షాలకు నీరు నిలబడిన రైతుల పొలాలను ఏరువాక కేంద్రం పల్నాడు జిల్లా శాస్త్రవేత్త ఎం.వెంకటరాములు లాంఫాం సైంటిస్ట్ ఎన్.సాంబశివరావు, పల్నాడు జిల్లా వనరుల కేంద్రం జిల్లా శిక్షణా కోఆర్డినేటర్ ఎన్.శివకుమారి, సహాయ వ్యవసాయ సంచాలకులు (రెగ్యులర్) నరసరావుపేట ఎంఎఓ పి.మస్తానమ్మ, టి.శ్రీలత, రైతు సేవ కేంద్రం సిబ్బందితో కలసి సందర్శించారు. శాస్త్రవేత్తలు అధిక వర్షాల బారిన పడిన పంటలను కాపాడుకోవడానికి 13.0.45 10 గ్రాములు, యూరియా 10 గ్రాములు, మెగ్నీషియం సల్ఫేట్ 10 గ్రాములు తగినంత నీటితో కలిపి పిచికారి చేయాలని, పొలంలో నీటిని తీసివేసి ఎకరాకు 30 కిలోల యూరియా 15 కిలోల పొటాష్ నేలకు వేసుకోవాలని తెలిపారు. పూత పిందె రాలకుండా ఉండటానికి 400 గ్రాముల అగ్రోమిన్ మాక్స్ (ఫార్ములా 4)ను ఎకరాకు పిచికారి చేయాలి. మొక్కలు వాడిపోయిన చోట కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ళ చుట్టూ పోయాలని తెలిపారు.

మలేరియా వ్యాధి పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మలేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ అన్నారు. మండల కేంద్రం రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు దోమలు వృద్ధి చెందే అవకాశముందని అన్నారు. దోమలు కుట్టటం వల్ల మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశముందన్నారు. ఈ వ్యాధులు రాకుండా జాగ్రత్తలను వివరించారు. అదే విధంగా దోమలువృద్ధి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి అవగాహనకల్పించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సాయి, డాక్టర్ జగన్ నరసింహారెడ్డి, హెల్త్ సూపర్ వైజర్ రామయ్య, హెల్త్ అసిస్టెంట్లు కిరణ్ కుమార్, సురేష్, ఎఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సింగ్ అభ్యర్థులకు జపాన్‌లో ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎన్‌ఎవిఐఎస్ హెచ్‌ఆర్‌వారి సంయుక్త ఆధ్వర్యంలో నర్సింగ్ చదువుకున్న విద్యార్థులకు జపాన్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి కె.సంజీవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సింగ్ అభ్యర్థులు జపాన్‌లో పనిచేయడానికి సిద్ధపడి ఉండాలని అభ్యర్థి తప్పనిసరిగా ఏఎన్ఎం, జిఎన్ఎ, బిఎస్‌సి నర్సింగ్ పూర్తి చేసి ఉండడంతో పాటు 20 నుండి 32 ఏళ్ల వయసు మధ్య ఉండాలన్నారు. బయోడేటా విద్యార్హత పత్రాలు, పాస్ పోర్టు, అనుభవ ధృవీకరణపత్రం తప్పనిసరిగా ఉండాలన్నారు. బెంగుళూరులో జరగనున్న శిక్షణ సమయం 6 నెలల పాటు రోజుకు 7 గంటలు ఉంటుందన్నారు. ఈ శిక్షణ జపనీస్‌భాషలో ఎన్5, ఎన్4, స్కిల్, ఎన్3లలో ఇస్తారన్నారు. దీనికై అభ్యర్థి రూ.3.50 లక్షలు చెల్లించాలన్నారు. ఉత్సాహమున్న అభ్యర్థులు ఫోన్ నెంబర్: 9988853335ను సంప్రదించాలన్నారు.

పంట నమోదులో సాంకేతికతను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



మండల కేంద్రం రొంపిచర్ల తహశీల్దారు కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగంపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు నిర్మల మాట్లాడుతూ ప్రభుత్వం రైతులు సాగు చేస్తున్న పంటలు నమోదుకు నూతన సాంకేతికను ప్రవేశపెట్టిందన్నారు. అందులో భాగంగా పంటకోత ప్రయోగంపై రెండు శాఖల సిబ్బందికి శిక్షణ ఇస్తారన్నారని పేర్కొన్నారు. మండల వ్యవసాయ అధికారిణి శివ లలిత మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సాంకేతిక ప్రకారం రైతులు పండించిన పంటలకు పంటకోత ప్రయోగం కార్యక్రమం నిర్వహించాలన్నారు. అదే విధంగా వారికి పంటకోత ప్రయోగంపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఓలు, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకచవితి నిబంధనలు పాటించండి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

వినాయకచవితి వేడుకలు సందర్భంగా పాటించాల్సిన నియమనిబంధనలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను ప్రతి పందిరి నిర్వాహకులు తప్పక పాటించాలని అర్బన్ సిఐ రమేష్ అన్నారు. మంగళవారం స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా గణేష్ విగ్రహ ప్రతిష్ట, పందిళ్ళు, మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి ఐదు లేదా అంతకంటే ఎక్కువ మంది సభ్యులతో కమిటీగా ఏర్పడి వారి వివరాలు సంబంధిత పోలీస్‌స్టేషన్లో తెలియజేయాలన్నారు. పంచాయతీ, మున్సిపాలిటీ స్థలము, ప్రయివేట్ స్థలాలలో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలను కుంటే సంబంధిత స్థల యజమాని, సంబంధిత విభాగపు అధికారుల అనుమతి తప్పని సరిగా తీసుకోవాలన్నారు. వీటితో పాటు పోలీసుల, ఫైర్, విద్యుత్ శాఖల అనుమతి తప్పని సరిగా తీసు కోవాలన్నారు. ఆయా విభాగా లు సూచించిన నియమ ని బంధన లకు అనుగుణంగా పందిళ్ళు, మండ పాలు వద్ద ముందస్తుగా నీళ్ళను, ఇసుక, అగ్ని ప్రమాదాలు జరుగకుండా జాగ్రతలు తీసు కోవాలన్నారు. గణేష్ ప్రతిమల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, సమయం, నిమజ్జన మార్గం విగ్రహ నిమజ్జనానికి ఉపయోగించే వాహన వివరాలను విధిగా తెలియ జేయాలన్నారు. రోడ్డుపైన ఉండరాదని, బ్యానర్లు, ఫ్లెక్సీలతో రాక పోకలకు అంత రాయం కలిగించ రాదన్నారు. ఉత్సవాల సమయంలో బాణసంచా లను ఉపయోగించరాదని, ఊరేగింపులో పోలీస్ వారి అనుమతి లేకుండా వేషధారణలు, ఎక్కువ శబ్దము వచ్చే వాయిద్యాలు అనుమతి లేదన్నారు. ఊరేగింపు సమయంలో ఉత్సవ నిర్వాహకులు బాధ్యత వహించాలన్నారు.



వరద బాధితుల కోసం తరలిన వాహనం

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

వరద బాధితుల సహాయార్థం సత్తెనపల్లి నియోజకవర్గం నుండి పులిహోర ప్యాకెట్లు, బిస్కెట్లు మంగళవారం పంపించారు. వెలుగు ఆధ్వర్యంలో సత్తెనపల్లి, ముప్పాళ్ల, రాజుపాలెం, నెకరికల్లు మండలాల నుండి సత్తెనపల్లి 500, ముప్పాళ్ల 500, పులిహోర పాకెట్స్ , రాజుపాలెం, నెకరికల్లు మండలాల నుండి 1000 బిస్కెట్ పాకెట్స్, వరద బాధితుల సహాయార్థం ప్రత్యేక వాహనంలో ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపించారు. కార్యక్రమంలో ఆయా మండలాల వెలుగు అధికారులు పాల్గొన్నారు.



నిర్వాసితులకు టాటా వాటర్ సహాయం

ప్రజాశక్తి - బెల్లంకొండ

మండల కేంద్రమైన బెల్లంకొండలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఇబ్బందులు పడుతున్న వారికి టాటా వాటర్ బాటిల్ వారి సహాయ సహకారంతో మంగళవారం తహశీల్దారు అశ్రుపునిస, టిడిపి మండల నాయకులు టాటా వాటర్‌బాటిల్ డీలర్స్ ఆధ్వర్యంలో నిర్వాసితులకు వాటర్ బాటిల్స్, పండ్లు, ఆహార పదార్థాలు మొదలైనవి పంపిణీ చేశారు. మండలంలోని ముంపు గ్రామాలైన ఎమ్మాజి గూడెం గ్రామస్తులను మెరక ప్రదేశానికి తరలించారు.



దెబ్బతిన్న పంటకు నష్ట పరిహారమివ్వాలి

ప్రజాశక్తి - పెదకూరపాడు

పూర్తిగా దెబ్బతిన్న పత్తి పంటకు ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి దర్శి శేషారావు డిమాండు చేశారు. మంగళవారం పత్తి, అపరాల పంటలకు నష్టపరిహారం కోరుతూ పెదకూరపాడు తహశీల్దారు డేనియల్‌కు రైతుసంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. పాక్షికంగా దెబ్బతిన్న పత్తికి రూ.25 వేలు, పూర్తిగా దెబ్బ తిన్న అపరాలకు ఎకరానికి 25,000, పాక్షికంగా దెబ్బ తిన్నవాటికి రూ.15వేలు ఇవ్వాలన్నారు. పంట వేయని రైతులకు ఇన్పుట్ సబ్సిడీ పేరుతో రూ.పదివేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ వినతిలో రైతు ప్రతినిధులు భాష్యం శివ కోటేశ్వరరావు, కంచర్ల అచ్యుతరావు, హబీబు, రామారావు, శ్రీను పాల్గొన్నారు.

6 వరకు పర్యాటకులు రావొద్దు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కొండవీడు ఘాట్ రోడ్డులో వర్షాల వలన కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న దష్ట్యా ఈ నెల 6 వ తేదీ వరకు కొండవీడు నగరవనం సందర్శకుల రాకను నిలిపివేస్తూ ఘాట్ రోడ్డు మూసివేస్తున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి ఎన్. రామ చంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

పెదకూరపాడు పంచాయతీలో బాలింతలకు, గర్భిణీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ మున్ని ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ వైద్యపరీక్షల్లో భాగంగా హిమోగ్లోబిన్ పరీక్షలు చేపట్టారు. కిషోర బాలికలకు ఎత్తు, బరువు తూచారు. కార్యక్రమంలో ఏఎన్ఎం వరమ్మ, అంగన్వాడీ టీచర్లు స్రవంతి, వెంకటలక్ష్మి, బివి.సామ్రాజ్యం, సిహెచ్ అరుణ, కుమారి పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - వినుకొండ

మండలంలోని ఎనుగుపాలెం పిహెచ్‌సిలో 'మీకు తెలుసా?' హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహనా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ, హాండ్స్ అఫ్ కంపాషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గర్భిణి స్త్రీలకు అందించే ఆరోగ్య సేవలు, హెచ్ఐవి ఉన్న తల్లి నుండి బిడ్డకు రాకుండా ఉండేందుకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే దానిపై డాక్టర్ రామానాయక్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్ సి.హెచ్.ఒ జే. యోగీస్వరమ్మ, పద్మావతి సూపర్వైజర్ కమల బాయి, శివ, రాజు, ఎఎన్ఎంలు, ఆషా వర్కర్లు, పాల్గొన్నారు.

ఏపిపియుఎస్ఎంఏ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి- మాచర్ల

ఏపిపియుఎస్ఎంఏ మాచర్ల నియోజకవర్గ అధ్యక్షునిగా వాణీవిద్యానికేతన్ ప్రిన్సిపాల్ కె.వి. రమణ 7వ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా శ్రీజెనిత్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్. శ్రీనివాసులును ఎన్నుకొన్నారు. కిడ్స్ పాఠశాలలో మంగళవారం జరిగిన డివిజన్ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షునిగా బి. వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులుగా వేముల వెంకటేశ్వర్లు, కె. వెంకట్రావు, జాయింట్ సెక్రటరీలుగా డి. శ్రీనివాసరావు, వి. హారికారెడ్డి, ట్రెజరర్‌గా ఎస్. శ్రీనివాసరావు, సబ్ ట్రెజరర్‌గా ఏ. సురేష్ కుమార్, ఆడ్వైజర్‌గా రామకృష్ణశాస్త్రి ఎన్నుకోబడ్డారు. ఈ కార్యక్రమంలో మాచర్ల, వెల్దుర్తి, దుర్గి, రెంటచింతల, కారంపూడి మండల ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్స్ పాల్గొన్నారు.



తెనాలి నియోజకవర్గంలో

15,400 ఎకరాల్లో నీట మునిగిన వరి

ముంపు పొలాలు పరిశీలించిన మంత్రి నాదెండ్ల మనోహర్, అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు



వ్యవసాయాధికారులతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

ప్రజాశక్తి-తెనాలి

భారీ వర్షాలు, వరద ప్రభావంతో నీట మునిగిన పంట పొలాలను రాష్ట్ర వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు బుధవారం పరిశీలించారు. వ్యవసాయశాఖ ఎడిఎ పరిధిలోని కొల్లిపర మండలంలో వల్లభాపురం, దంతులూరు, అత్తోట, తెనాలి మండలంలో హాఫ్‌పేట, ఖాజీపేట మండలాల్లో బృందం పర్యటించింది. వ్యవసాయ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఢిల్లీరావు, ప్రిన్సిపల్ సెక్రటరీ పి.రాజశేఖర్, జిల్లా వ్యవసాయాధికారి ఎన్.వెంకటేశ్వర్లు, ఏడిఎ ఎన్.ఉషారాణి బృదంలో ఉన్నారు. ఈ సందర్భంగా రైతులు వారి సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. గతంలో ఎన్నడూ చూడని విదంగా వరద ప్రభావం ఉందని, ఫలితంగా తీవ్రంగా నష్టపోయినట్లు రైతులు వాపోయారు. నష్టం అంచనాలను ప్రభుత్దం దృష్టికి తీసుకువెళతామని, రైతులు అధైర్య పడవద్దంటూ అధికారులు వారికి భరోసా కల్పించారు. అధికారుల పర్యటన వివరాలను ఏడిఎ ఎన్.ఉషారాణి వెల్లడించారు. ప్రాధమిక అంచానల ప్రకారం కొల్లిపర మండలంలో వరిసాగు 14,900 ఎకరాల్లో ఉందని, దీనిలో 4,400 ఎకరాల్లో పంట ముంపుకు గరైందన్నారు. అలాగే తెనాలి మండలంలో 16,624 ఎకరాల్లో వరి సాగులో ఉండగా 10,940 ఎకరాలు ముంపుకు గరైందన్నారు. ముఖ్యంగా కొలకలూరు పరిధిలో 3300 ఎకరాల్లో ఖరీఫ్ సాగులో ఉండగా 2500 ఎకరాలు ఇక్రాప్‌లో నమోదైందని, రెండు మూడు రోజుల్లో ఇక్రాప్ పూర్తి చేసుకోవాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల అనంతరం పంట నష్టం అంచనాలుంటాయని, ప్రసుత్తం పైరు 30 నుంచి 40 రోజుల దశలో ఉందని ఎడిఎ చెప్పారు.

నల్లమడ డ్రెయిన్ గండితోనే పొలాలు మునక

భారీ వర్షాలు, వరద ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను ఖాజీపేట, హఫ్‌పేట ప్రాంతంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటించారు. పంట నష్టంపై రైతులు, ఏడిఎ ఎన్.ఉషా రాణి మంత్రికి వివరించారు. నల్లమడ డ్రెయిన్ గండి కారణంగా వర్షానికి మించి వరద వచ్చిందని రైతులు ఆరోపించారు. విపత్తు నుంచి ప్రభుత్వమే ఆదుకోవాలని ఆదుకోవాలని కోరారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి నష్టనివారణ చర్యలు చేపడతామని మంత్రి రైతులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో కొలకలూరు 1,2,3 రైతు సేవాకేంద్రాల సిబ్బంది నాగరాజు ఎఈఓ మోహన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు సాయం

ప్రజాశక్తి - కొల్లిపర

వరద బాధిత కుటుంబాలను ప్రభుత్వము అన్ని విధాలుగా ఆదుకుంటుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మాత్యులు నాదెండ్ల మనోహర్ అన్నారు మంగళవారం కొల్లిపర మండలంలోని కృష్ణా పరివాహ ప్రాంతాలైన అత్తలూరు వారి పాలెం వల్లభాపురం పిడపర్తి పాలెం హనుమాన్ పాలెం బొమ్మువానిపాలెం గ్రామాల్లో రెండో రోజు కొనసాగుతున్న సహాయక చర్యల గురించి కరకట్ట వద్ద వరద ఉధృతిని అధికార యంత్రాంగం తో కలిసి పర్యవేక్షించారు. హనుమాన్ పాలెం తూములూరు స్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో నిర్వాసితులకు అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ముంపు బాధిత గ్రామాల్లోని ప్రతి కుటుంబానికి పాతిక కేజీల బియ్యం, ఒక కేజీ కందిపప్పు పంచదార కేజీ పామాయిల్ అందిస్తామని పేర్కొన్నారు అంతేకాక మార్కెటింగ్ శాఖ ద్వారా వరద బాధిత కుటుంబాలకు ఉల్లిపాయలు బంగాళదుంపలు అందిస్తారని తెలిపారు మత్స్యకార చేనేత కుటుంబాలకు అదనంగా మరొక పది కిలోలు వేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి తాసిల్దార్ సిద్ధార్థ మండల పార్టీ అధ్యక్షులు భీమవరం కిషోర్ రెడ్డి భీమవరపు వేణుగోపాల్ రెడ్డి పెరికల రాంబాబు కొల్లి శివారెడ్డి కొల్లి శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదులో తప్పనిసరిగా నిజమైన సాగుదారుని పేరు నమోదు చేసి ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలని వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బి రాజశేఖర్ అన్నారు. కొల్లిపర మండలంలోని అత్తలూరు వారి పాలెం వల్లభాపురం దంతులూరు అత్తోట గ్రామాల్లో ఇటీవల కురిసిన అధిక వర్షాలకు, వరద ముంపుకు గురైన పంట పొలాలను మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తల తో కలిసి ఆయన పరిశీలించారు

ప్రజాశక్తి - చేబ్రోలు, పొన్నూరు

ముంపునకు గురైన వరి పొలాలను చేబ్రోలు, పొన్నూరు మండలంలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ ప్రతిభశ్రీ,గుంటూరు డాట్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టరు ఎం నగేష్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశామని మండల వ్యవసాయ అధికారి బి శ్రీనివాస్ నాయక్ తెలిపారు. వరద ముంపు నుండి పైరు నిలదొక్కుకునేందుకు ముందుగా పొలంలోని నీటిని తీసి బయటకు పంపాలని అన్నారు. తరువాత ఎకరాకు 30 కేజీలు యూరియా, 15 కేజీల పొటాష్ కలిపి పొలంలో చల్లటం వలన ప్రయోజనం ఉంటుందని చెప్పారు.







ప్రజాశక్తి - దుగ్గిరాల

అధిక వర్షాలకు నీట మునిగి ఉన్న వరి పొలాలలో నీరు వారం రోజుల కన్నా ఎక్కువ రోజులు ఉంటే పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉన్నదని వ్యవసాయ శాఖ శాస్త్రవేత్త పాలడుగు సత్యనారాయణ అధికారులకు తెలిపారు. మండలంలో అధిక వర్షాలకు ముంపుకు గురైన ప్రాంతాల పరిశీలనకు వచ్చిన వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్ ఢిల్లీ రావు స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి రాజశేఖర్ మరియు అధికారుల బృందానికి ఆయన పరిస్థితిని వివరించారు. పెద్ద కొండూరు గ్రామంలో నీటి మునిగిన పొలాలను పరిశీలించిన అనంతరం వారు రైతులతో స్థానిక అధికారులతో మాట్లాడారు. . వారం రోజుల కన్నా ఎక్కువ నీరు నిలువ ఉండి పొలాలు నష్టపోయినట్లైతే అప్పుడు రైతులకు నష్టపరిహారం రాయమని ఉన్నత శ్రేణి అధికారులు స్థానిక అధికారులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ వెంకటేశ్వర్లు ఏడిఏ ఉషారాణి ఏవో పి శిరీష మరియు వ్యవసాయ శాఖ సిబ్బంది పదకొండూరు గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు

వరద ముంపు బారిన పడిన పత్తి చేలను శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖాధికారులు మంగళవారం పరిశీలించారు. మండలంలోని పెదపరిమిలో వరద ముంపు బారినపడ్డ పత్తి చేలను తాడికొండ మండలం లాం లోని ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డాక్టర్ ఎస్ వి ఎస్ గోపాలస్వామి, డాక్టర్ ఎన్ వెంకటలక్ష్మి, డాక్టర్ ఐ ఉషారాణి,వ్యవసాయ శాఖాధికారి కె శ్రీ రంజని పరిశీలించారు. అనంతరం పత్తి పంట రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.



రైతుల్ని ఆదుకోవాలి : వైసిపి

ప్రజాశక్తి - పొన్నూరు : అకాల భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన వరి పొలాల రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని పొన్నూరు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ కోరారు. సోమవారం నిడుబ్రోలు, పచ్చలతాడిపర్రు తదితర ప్రాంతాల్లో వరద ముంపుకు గురై వరి పైరు నీట మునిగిన పొలాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురుగు, పంట కాలువల మరమ్మత్తులు గత కొన్ని సంవత్సరాలుగా కట్టల పటిష్టం, పూడిక తీత పనులు చేపట్టకపోవడం వల్ల వరద నీరు ఎగదన్ని పొలాల్లోకి ప్రవేశించిందని రైతులు తెలిపారు. పొన్నూరు ఛానల్, మన్నవ తుంగభద్ర మురుగు కాలువ కు గండ్లు పడి పొలాలు కకావికలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం మీనమేషాలు లెక్కించకుండా తక్షణమే అధికారులతో నష్టపోయిన పొలాల ఎన్యుమరేషన్ చేయించాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో రైతులను ఆదుకున్న రైతు భరోసా ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో జమ చేయక పోవడం బాధా కర మన్నారు. కార్యక్ర మంలో షేక్. నాజర్ స్థానిక రైతులతో పాటు, వైసీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



11న గుంటూరులో రజక వృత్తిదారుల మహాసభ

ప్రజాశక్తి-తాడేపల్లి



కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని రజక వృత్తిదారుల సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు కోరారు. ఈ నెల 11వ తేదీ గుంటూరు యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగే రజకవృత్తిదారుల మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం చాకలి ఐలమ్మ రజక సంక్షేమ సంఘం కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఉండవల్లి పార్థసారధి అధ్యక్షతన నగర కమిటీ, విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రజకులకు నేటికీ అభివృద్ధి చెందకపోవడానికి పాలకుల విధానాలే కారణమని చెప్పారు. రజక వృత్తిదారులు నేటికీ శ్రమకు తగ్గ వేతనాలు అందడంలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రజక వృత్తి కోసం కేటాయించిన స్థలాలు ఆక్రమణకు గురికావడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జా సుబ్బారావు మాట్లాడుతూ వృత్తిదారులకు రూ.200 యూనిట్లు ఉచిత కరెంటు ఇవ్వాలని కోరారు. ఆదరణ పథకాన్ని అమలు చేసి నాణ్యమైన వృత్తి పరికరాలు ఇవ్వాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన రజక వృత్తిదారులకు వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు, పి.శివయ్య, ఎం.బాబూరావు, ఒ.రాజు, నరసింహారావు, ఎస్.శివయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరు పట్టణంలో డెంగీ ప్రభలుతున్న నేపథ్యంలో పట్టణంలో శానిటేషన్ సమస్యలపై దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబుకు పొన్నూరు పట్టణాభివృద్ధి కమిటీ ప్రతినిధులు వినతి పత్రాన్ని అందజేశారు. డ్రైన్లలో మురుగు పారుదల మందగించి దోమల సమస్య పెరిగిందని, యుద్ధప్రాతిపదికన సైడ్ డ్రైన్లలో ఆయిల్ బాల్స్ వదలటం, దోమల నివారణ మందు స్ప్రే చేయించడం చేపట్టాలని కోరారు. అలానే మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సులో తిష్ట వేసిన బినామీలను ఖాళీ చేయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పట్టణాభివద్ధి కమిటీ అధ్యక్షుడు లీలా ప్రసాద్, కన్వీనర్ యాసిన్ బాబా, వివేకా విద్యా సంస్థల అధినేత ఉప్పల సుకుమార్ బాబు పాల్గొన్నారు.

జ్వర పీడితునికి ఎంఆర్‌పిఎస్ సాయం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

డెంగీ జ్వరం కారణంగా చికిత్సపొందుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావు మాదిగను యాక్ట్ చైర్మన్ ఆళ్లమూడి ప్రభాకర్ మంగళవారం పరామర్శించారు. మంగళవారం కొలకలూరు తమ వివాసంలో కలసి యాక్ట్ తరపున రూ 15 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ ప్రభాకర్ మాట్లాడుతూ వెనుకబాటుతనంలో ఉన్న పేదలకు యాక్ట్ సంస్థ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో అత్తోట ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి : కేశన

ప్రజాశక్తి - మంగళగిరి

అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, సంక్షేమ, స్వచ్ఛంద సేవా సంస్థలు తమ శక్తి మేరకు వెంటనే వరదబాధితులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తమ సంఘ నాయకులు, కార్యకర్తలు ఇప్పటికే వరద బాధితులకు ఆహారం, మంచినీరు, తినుబండారాలు, ఇతర గృహ అవసరాలనందిస్తూ, అన్ని జిల్లాలలో సంక్షేమ-సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. గత 50 ఏళ్ల చరిత్రలో కుండపోత వర్షాలతో, ఇంతటి భారీ వరద బీభత్సం ప్రకాశం బ్యారేజీ వద్ద ఇంతవరకు చూడలేదని, గత ప్రభుత్వం బుడమేరు కరకట్టకు మరమ్మతులు చేయించి, బలోపేతం చేయించి ఉంటే, విజయవాడకు ఇంతటి ఉపద్రవం వచ్చి ఉండేది కాదని వాపోయారు. ఇప్పటికైనా బుడమేరు, కృష్ణా పరివాహకం, కొల్లేరు ప్రాంతాలలో ఆక్రమణల్ని, అక్రమ కట్టడాలని, అక్రమ సాగుదారుల్ని తొలగించి, అధిక వర్షాలకు వచ్చే భారీ వరదల పెనుముప్పు నుండి ప్రజల్ని కాపాడాలన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

భారీ వర్షాల వలన మంగళగిరి నియోజకవర్గంలో ముంపు గురైన వరద బాధితులను రాష్ట్ర మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ వెంటనే స్పందించి వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటున్న లోకేష్ కు జనసేన పార్టీ సీనియర్ నాయకులు తిరుమల శెట్టి కొండలరావు మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కృతజ్ఞతలు తెలిపారు.

వరద బాధితులకు పులిహోర ప్యాకెట్లు

ప్రజాశక్తి - తెనాలి

వరద ప్రభావిత ప్రాంతం విజయవాడలో బాధితులను ఆదుకునేందుకు పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం నుంచి 5000 పులిహోర ప్యాకెట్లను తరలించినట్లు ఆలయ ఉప కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద్ తెలిపారు. దేవదాయ ధర్మదాయశాఖామాత్యులు ఆనం రామనారాయణరెడ్డి, కమిషనర్ యస్. సత్యనారాయణ ఆదేశంతో కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. జిల్లా కలెక్టరు సూచన మేరకు విజయవాడ గుణదల, క్రీస్తురాజపురం వరదప్రభావిత ప్రాంతములకు ప్రత్యేక వాహనము ద్వారా పులిహోర ప్యాకెట్స్ అందజేసినట్లు తెలిపారు.

టిడిపి మహిళా విభాగం వితరణ

ప్రజాశక్తి - తెనాలి : భారీ వర్షాలు, వరదల కారణంగా ముంపుకు గురైన ప్రాంతాలలో టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జాస్తి సరళ బుధవారం పర్యటించి వాటర్ బాటిల్స్, పండ్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందించే సాయానికి తోడు తమ వంతు బాధ్యతగా సేవా కార్యక్రమం నిర్వహించినట్లు ఆమె చెప్పారు.

విజ్ఞాన్స్ అధ్యాపకుడికి పీహెచ్‌డీ

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలోని ఈఈఈ డిపార్ట్‌మెంట్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పమిడి లక్ష్మినారాయణకు తమ యూనివర్సిటీ ఈఈఈ విభాగంలో పిహెచ్‌డి పట్టా అందజేసిందని వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. ఈయన 'ఫేసర్ మెజర్‌మెంట్ యూనిట్ ప్లేస్‌మెంట్ విత్ కంప్లీట్ అబ్జర్వబిలిటీ ఫర్ డైనమిక్ స్టేట్ ఎస్టిమేషన్ ఇన్ పవర్ సిస్టమ్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈయనకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఈఈఈ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ మెర్సీ రోసలీనా గైడ్‌గా వ్యవహరించారన్నారు. లక్ష్మినారాయణకు విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వర్సిటీ వీసీ నాగభూషన్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు అభినందించారు.



పిహెచ్‌డి పట్టా అందుకుంటున్న లక్ష్మీనారాయణ

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 14 మంది ఎంపిక

ప్రజాశక్తి-గుంటూరు :ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 5న కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమా వేశ మందిరంలో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యా యులకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కొర్నెపాడు జెడ్పీహెచ్‌ఎస్ నుండి షేక్.షఫీఉల్లా, బ్రాడీపేటలోని ఎస్‌ఎస్‌ఎన్ఒ గవర్నమెంట్ హైస్కూల్ నుండి పొగతోట సునితా రజని, నులకపేట ఎంపియుపి ఉర్దూ స్కూల్ అబ్దుల్ షజీర్, మందడం జెడ్పీహైస్కూల్ అచనా కోటేశ్వరరావు, పెనుమాక జెడ్పీహెచ్‌ఎస్ బి.రమేష్‌బాబు, దుగ్గిరాలి బాలుర జెడ్పీ హైస్కూల్ డి.నాగకృష్ణకుమారి, చింతలపూడి ఎంపిపి స్కూల్ కసుకుర్తి భాస్కరరావు, పేరేచర్ల ఎంపిపి స్కూల్ తలటం సుబ్బారావు, నులకపేట ఎంపియుపి ఉర్దూ స్కూల్ షహిద్ అలీ షేక్, నిడమర్రు జెడ్పీ హైస్కూల్ షేక్.అనిలా సుల్తానా, చినకోండ్రుపాడు జెడ్పీ హైస్కూల్ జొన్నలగడ్డ జోసఫ్ సుధీర్‌బాబు, కాకుమాను ఎంపిపి స్కూల్ వల్లూరు శ్రీరామ ప్రసాద్, సంగడిగుంట మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ స్కూల్ నెం:79 షహనాజ్ బేగం, దుగ్గిరాల గర్ల్స్ జెడ్పీ హైస్కూల్ అరిగ పద్మకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందించనున్నట్లు తెలిపారు. కావున అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయులు 5న మధ్యాహ్నం 2 గంటలకు హాజరై రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

బుడంపాడులో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-గుంటూరు : శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, ప్రధానంగా విలీన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని నగరపాలక కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం బుడంపాడులోని పలు ప్రాంతా లను, రిజర్వాయర్‌ని పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బుడంపాడు చెరువువైపు నివాసాలకు వెళ్లే రోడ్డు వర్షాలకు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, స్థానికుల అభ్యర్థన మేరకు తక్షణం ప్యాచ్‌వర్క్ చేపట్టాలని, అవసరం ఉన్న ప్రాంతంలో కల్వర్ట్ నిర్మాణానికి అంచనాలు వేసి పంపాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్‌లో మోటర్లు సరిగా పని చేయకపోవడం వలన పూర్తి స్థాయిలో సరఫరా సాధ్యం కావట్లేదని, సమస్య పరి ష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బుడంపాడు చెరువు వాకింగ్ ట్రాక్ కొన్ని ప్రాంతాల్లో కుంగి వాకింగ్‌కి ఇబ్బందిగా ఉందన్న స్థానికుల అభ్యర్థన మేరకు వాకింగ్‌కి వీలుగా మరమ్మతులు చేపట్టాలని ఏఈని ఆదేశించారు.పర్యటనలో ఎస్.ఈ. శ్యాం సుందర్, ఈఈ కొండారెడ్డి, డిసిపి శ్రీనివాస్ పాల్గొన్నారు.



చెరువును పరిశీలిస్తున్న కమిషనర్

పాతగుంటూరులో పర్యటన :వర్షం నీరు ఇళ్లల్లో నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామని, నగర ప్రజలు కూడా డ్రైన్లను శుభ్రం చేయడానికి వీలు లేని విధంగా వాటి మీదకు నిర్మాణాలు చేపట్టవద్దని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక జున్ను షాహిద్ నగర్, బిఆర్ స్టేడియం, శ్రామిక నగర్ ప్రాంతాల్లో డిఈఈ శ్రీధర్‌తో కలిసి పర్యటించి అధికారులు తగు సూచనలు చేశారు. ఆయా ప్రాంతాల్లో భవిష్యత్‌లో నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కార చర్యలకు ప్రతి పాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రస్తుతం నీటిని బెయిల్ ఔట్ చేశామన్నారు.

రిజర్వాయర్లను క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలి

ప్రజాశక్తి-గుంటూరు :నగర ప్రజలకు సరఫరా చేసే త్రాగునీటి రిజర్వాయర్లను నిర్దేశిత గడువు ప్రకారం శుభ్రం చేయాలని, ప్రస్తుత వర్షాల వలన నీటిని అధిక ప్రాధాన్యతగా ఫిల్టర్ చేయాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక నాజ్ సెంటర్‌లోని రిజర్వాయర్లను కమిషనర్ పరిశీలించారు. క్రమం తప్పకుండా రిజర్వాయర్లను శుభ్రం చేయాలని, శుభ్రం చేసిన తేదీని ప్రత్యేకంగా బోర్డు మీద నోట్ చేయాలన్నారు. ప్రస్తుతం కృష్ణానదిలో వరద వస్తున్నందున నగర ప్రజలకు అందించే నీటిని మరింతగా ఫిల్టర్ చేయాలన్నారు. హెడ్ వాటర్ వర్క్స్‌తో పాటు ప్రతి రిజర్వాయర్ దగ్గర తాగునీటిని సరఫరాకి ముందు క్లోరిన్ శ్యాంపిల్స్ చెక్ చేయాలన్నారు. వర్షాలు, గాలులకు విద్యుత్ అంతరాయం వచ్చినా తాగునీటి సరఫరాకి ఆటంకం లేకుండా ముందస్తుగా జనరేటర్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దాతలు సహాయం అందించాలి

ప్రజాశక్తి-గుంటూరు : భారీ వర్షాలు, వరదల వలన తీవ్రంగా నష్టపోయిన ప్రజలకు అండగా నిలవడానికి దాతలు ముందుకు రావాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో కోరారు. దాతల నుండి నగదు, వస్తువుల సేకరణకు గుంటూరు నగరపాలక సంస్థ ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామన్నారు. వర్షాలు, వరదల ప్రభావంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొన్ని ప్రాంతాల్లో వరదలు వచ్చి ఇళ్లు కూడా ఖాళీచేసి ప్రభుత్వ పునరావాస కేంద్రాలకు చేరుకున్నారన్నారు. వరద బాధితులకు సహాయం చేయటానికి వీలుగా హిందూ కాలేజి సెంటర్‌లోని జిఎంసి ట్రావెలర్స్ బంగ్లాలో 5వ నెంబర్ గదిలో సీనియర్ అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సెల్‌లో దాతలకు వారు అందించిన నగదు, వస్తువులకు తగిన రశీదు అందించి, అందుకు నిర్దేశిత రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేస్తారన్నారు. కావున దాతలు ముందుకు రావాలని, వివరాలకు జిఎంసి అడిషనల్ కమిషనర్ 9849908396ను సంప్రదించాలన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి ఎపి అశా వర్కర్స్ యూనియన్(సిఐటియు) రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు మంగళవారం గుంటూరు జిల్లాల్లో ఆశాలు నిరసన తెలిపారు. అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. గుంటూరు, బృందావన్ గార్డెన్స్‌లోని యుపిహెచ్‌సి వద్ద ఆశా వర్కర్లు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఒప్పంద జిఒలు వెంటనే విడుదల చేయాలని, జిఒలు విడుదలయ్యే వరకూ ఆశా వర్కర్ల రిటైర్మెంట్లు ఆపాలని, రికార్డులు వెంటనే ఇవ్వాలని, కలకత్తా ట్రైనీ విద్యార్థినిపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని, మహిళా రక్షణ చట్టం చేయాలని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లతో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు లక్ష్మీ, అనసూయ, రెబ్బమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి :గత సంవత్సరం అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తల ఆందోళన సందర్భంగా ఆనాటి ప్రభుత్వం చేసుకున్న ఒప్పంద జిఒలను వెంటనే విడుదల చేయాలని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. తక్షణమే జిఒ విడుదల చేసి అంగన్‌వాడీల పట్ల ఈ ప్రభుత్వం తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని ప్రకాష్‌నగర్‌లోని ఆరోగ్య కేంద్రం వద్ద అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ కలకత్తాలో వైద్యురాలిపై అత్యాచారం, ఆపై హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.లక్ష్మి, వి.రేణుక, వినోదిని, విజ యలక్ష్మి, బేబి, కె.జ్యోతి, కరుణ, విజయశ్రీ, విశ్రాంతమ్మ, సుమతి పాల్గొన్నారు.


ప్రజాశక్తి - ప్రత్తిపాడు, మేడికొండూరు :ఆశావర్కర్స్ వేతనాలు డిమాండ్లను నెరవేర్చాలని ప్రత్తిపాడు ఆశ వర్కర్లు ప్రత్తిపాడు, మేడికొండూరు పిహెచ్‌సి వైద్యులకు వినతి పత్రాలు అందజేశారు. స్థానిక సమస్యల పరి ష్కారానికి జిల్లాల్లో జాయింట్ మీటింగ్స్ ఏర్పాటు చేయాలని, ఒప్పంద జీఓ.లు వెంటనే విడుదల చేయాలని వారు కోరారు. ప్రత్తిపాడు కార్యక్రమంలో ఆశ వర్కర్లు జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ ధన లక్ష్మి, సీఐటీయూ మండల అధ్యక్షులు కె జ్యోతి, భారతి పాల్గొన్నారు.



తాడేపల్లిలో



ప్రత్తిపాడులో



మేడికొండూరులో

బాలికల భద్రతకే తొలి ప్రాధాన్యం : ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆడపిల్లల భద్రతకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తున్నదని శాసనసభ్యురాలు గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం స్టాల్ హై స్కూల్ బిసి వసతి గహాన్ని మాధవి పరిశీలించారు. సోమవారం పలువురు విద్యార్థినీలు తమను కొంత మంది వేధిస్తు న్నారని నగరంపాలెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో తాను పరిశీలించటానికి వచ్చానని, విద్యార్థినులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను ఆమె తెలుసు కున్నారు. గత రెండు సంవత్సరాల నుండి ఇలాగే జరుగుతున్నదని, గంజాయి బ్యాచ్ నేరుగా వసతి గృహంలోకి వచ్చి తీవ్రంగా ఇబ్బంది పెడ్తున్నారని విద్యార్థినుల ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేసారు. వసతి గృహం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి విష సర్పాలు వస్తున్నాయని, ఆహారం కూడా సరిగ్గా ఉండటం లేదని, మరుగు దొడ్లకు సరయిన డోర్లు లేవని, వార్డెన్ మరియు నిర్వాహకుల మీద కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులను కోరబోతున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.



తాగునీటి వ్యవస్థను తక్షణం మెరుగుపర్చాలి

సొంతగూటికి చేరుకుంటున్న ముంపు బాధితులు - మహానాడు, సుందరయ్యనగర్‌లో ఇళ్లన్నీ బురదమయం

ప్రజాశక్తి-తాడేపల్లి

గత రెండు రోజుల ఉగ్రరూపం దాల్చిన కృష్ణమ్మ మంగళవారం శాంతించింది. వరద తాకిడికి తమ ఇళ్లల్లో ఉన్న సామాన్లు ఎలా ఉన్నాయని బాధితులు వాటిని సర్దుకుంటున్నారు. సురక్షిత ప్రాంతాలకు, బంధువుల ఇళ్లకు వెళ్లిన బాధితులు తిరిగి తమ సొంతి గూటికి చేరుకుంటున్నారు. వరదకు తడిసిన విలువైన వస్తువులను చూసి బావురుమంటున్నారు. ఇళ్లలోకి బురద చేరడంతో శుభ్రం చేసుకునే పనిలో బాధితులు ఉన్నారు. సిపిఎం, టిడిపి, వివిధ స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన భోజనాలు బాధితులకు అందజేశారు. కొంతమంది అద్దెకు ఉంటున్న వారు ఇళ్లు ఖాళీ చేసి వెళ్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. బురదలో ఉన్న పనికొచ్చే వస్తువులను మినీ వాహనాలకు ఎక్కించుకుని సురక్షిత ప్రాంతాలకు వెళ్లారు. కొన్ని ఇళ్లు ఇంకా నీళ్లలోనే ఉన్నాయి. సుమారు పది వేల మంది ఇక్కడ నిరాశ్రయులు కావడంతో మంచినీరు అందడంలేదు. విజ్ఞాన కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ రాజకీయ పార్టీలు కృషి చేస్తున్నా అందరికీ మంచినీరు అందించడం అసాధ్యంగా మారింది. అడుగు మేర రోడ్లపై బురద పేరుకుపోవడంతో సిమెంటు రోడ్లు కాస్తా బురద రోడ్లుగా మారాయి. సేవా కార్యక్రమాల్లో సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరుగ వెంకటేశ్వర్లు, ఎస్.వెంకట్రావు, వేముల దుర్గారావు, ఎం.నాగేశ్వరరావు, బి.రామారావు, డివి భాస్కరరెడ్డి, పాప, ఉష, యు.సాయి, లక్ష్మణ, సీతమ్మ, ఎన్.రాము, సరస్వతి, కె.మేరి, ఎన్.చంద్రశేఖర్, సాయి, వై.బర్నబస్, డి.కోదండరామయ్య, బిట్రా రామారావు, ఐ.ఇస్సాకు తదితరులు పాల్గొన్నారు.





పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి : సిపిఎం

తాడేపల్లి మహానాడు, సుందరయ్యనగర్లో వరద తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ఎంటిఎంసి అధికారులు పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో అధికారులను కోరారు. ఇళ్ల నుంచి పెద్దఎత్తున వరద నీరు తగ్గడంతో అంటురోగాలు ప్రబలుతాయోనని ఆందోళన వ్యక్తం చేశారు. మంచినీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు. పైపులైన్లు మొత్తం వరద నీటిలో చిక్కుకోవడంతో వ్యర్థాలతో పాటు క్రిమి కీటకాలు నీళ్ల ద్వారా వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్ చల్లిన నీటినే సరఫరా చేయాలని అధికారులను కోరారు.



1500 మందికి భోజనాలు

తాడేపల్లి బైపాస్‌రోడ్డులోని అవర్ ప్లేస్ యాజమాన్యం దాతృత్వం చాటుకుంది. అవర్ ప్లేస్ యజమాని రవి, స్వాతి 1500 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. సిపిఎం విజ్ఞప్తి మేరకు ఆయన స్పందించారు. పట్టణ కమిటీ తరుపున రవికి ధన్యవాదాలు తెలిపారు. పెనుమాకలో టిడ్కో గృహాలు సమీపంలోని ఇందిరానగర్‌లో నివశిస్తున్న వరద బాధితులకు మంగళవారం టిడిపి నాయకులు మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు అమరా సుబ్బారావు, కొల్లి శేషు, పెనుమాక అధ్యక్షులు వీరేంద్రనాథ్ పాల్గొన్నారు.